క్లుప్తంగా

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

నాగలాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తలపెట్టిన నగరి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆదివారం నారయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీ పురం మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి సీఎం జగనన్న నగరి కార్యక్రమానికి జనసమీకరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

సీతారామ ఆలయంలో అన్నదానం


సీతారామ ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట సీతారామ ఆలయంలో ఆదివారం అన్నదానం జరిగింది. పాపానాయుడుపేట గ్రామానికి చెందిన మేకల్తూరు ఏలుమలై జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆలయంలో 1000 మందికి అన్నదానం నిర్వహించారు. ఏటా అన్నదానం చేయడం తమకు ఆనవాయితీ అని దాత తెలిపారు. కార్యక్రమంలో గోవిందస్వామి, రామకృష్ణ, దామోదరం, అర్జున్‌బాబు, రాజా, వడివేలు, దొరకృష్ణ, నాగమురగప్ప, తంబా హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రదోష పూజలు రేపు

నాగలాపురం: సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామచంద్రా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలు నుంచి 6 గంటల వరకు ఈ ప్రదోషకాల పూజలు జరుగుతాయని ప్రదోష నందీశ్వరునికి వాల్మీకేశ్వర స్వామికి మరకదాంబిగై అమ్మవారికి ఏకకాలంలో అభిషేకాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ ఏపీఎం బాలిరెడ్డి తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం రేపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఐటీడీఏ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అమర హాస్పిటల్, తిరుపతి, ఎంజీఎం హాస్పిటల్ శ్రీకాళహస్తి వైద్యసిబ్బంది వైద్యపరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఈపీసీ ఖాతాలో మరో అవార్డు


అవార్డు అందుకుంటున్న రియాజ్

వరదయ్యపాళెం: మండలంలోని బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్స్ సంస్థ, అఖిల భారత ఎన్జీఓ సంక్షేమ సంఘం ఫౌండేషన్ నుంచి అవార్డు అందుకుంది. ఆ సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్న స్వచ్ఛంద సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు. ఆ దశగా బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్స్ సంస్థ వ్యవస్థాపకుడిని జాతీయ సేవా రత్న పురస్కారంతో సత్కరించారు.

వేడుకగా ఉద్దికేశులమ్మ అమ్మవారి ఊరేగింపు



నాగలాపురం: మండలంలోని గ్రామదేవత ఉద్దికేశులమ్మ కొలువు పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి పలురకాల అభిషేకాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణలో భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని అలంకరించి పుర వీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఏ సర్వీసు బస్సు వచ్చినా ఎక్కడానికి ప్రయాణికులు క్యూకట్టారు. ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ఆర్డినరీ సర్వీసులు కూడా రద్దీగా నడిచాయి. ప్రయాణికులను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు కనిపించలేదు. ప్రయాణికులు సీట్ల కోసం తోపులాటకు దిగారు. దొంగలు హల్‌చల్ చేశారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లోపంతో బస్టాండ్లు గందరగోళంగా మారుతున్నాయి. దీనిపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడును వివరణ కోరగా పరిశీలించి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం


శెనగలమిట్టలో బైక్‌ర్యాలీ


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని ఉడమలపాడు పంచాయతీ శెనగలమిట్ట, గోపాలకృష్ణపురం గ్రామాల్లో సర్పంచ్ మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శెనగలమిట్టలో 120 ఇళ్లు, గోపాలకృష్ణపురంలో 130 ఇళ్లు, ఉడమలపాడులో 141 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు.

సమస్యలు వింటూ.. పరిష్కారం చూపుతూ..

శెనగలమిట్ట గ్రామంలో విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయని, పైకి లాగాలని స్థానికులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. అలాగే గోపాలకృష్ణపురంలో కొన్ని వీధిదీపాలు వెలగడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉడమలపాడులో కొన్ని ప్రాంతాల్లో వర్షం పడిన సమయంలో నీరు నిల్వ చేరుతోందని, దీంతో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని చెప్పారు. ప్రజల సమస్యలు సావధానంగా విన్న ఆయన ఆయా శాఖలకు సంబంధించిన అధికారులతో మాట్లాడారు. తక్షణం వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన సీమంతం, అన్నప్రాసనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మాటల్లో కాదు.. చేతల్లో అభివృద్ధి..

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న నవరత్నాలు, సంక్షేమ ఫలాలతో పేదరికం నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. అభివృద్ధి మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్న జగనన్నకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని.. ఏ సమస్య ఉన్నా తన కార్యాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఉడమలపాడు గ్రామంలో శుద్ధజల ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, జెడ్పీటీసీ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రాములమ్మ, సర్పంచ్ మనోహర్, కృష్ణయ్య, భాగ్యశ్రీ, సురేంద్రయాదవ్, మునిరాజాయాదవ్, సుబ్రహ్మణ్యంయాదవ్, పాండురంగయ్యయాదవ్, పెంచులయ్యయాదవ్, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణ యాదవ్, వెంకటరామయ్య, రమేష్, లక్ష్మయ్య, రోశయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


శుద్ధజల ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అందరినీ కలుపుకుని ముందుకు సాగుదాం


మునికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న వన్నెరెడ్డి సంక్షేమ సంఘ సభ్యులు

శ్రీకాళహస్తి: అందరిని కలుపుకుని వన్నెరెడ్డి జాగృతి సంక్షేమ సంఘం ముందుకు సాగాలని వన్నెరెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండాలని శ్రీకాళహస్తీశ్వరాలయ కాంట్రాక్టరు సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి వన్నెరెడ్డి జాగృతి సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెంబాకం మునికృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ జాగృతి సంక్షేమ సంఘం కమిటీ సహకారంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మప్పేటి సుబ్రహ్మణ్యంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



భీముడు, దుర్యోధనుడి మధ్య యుద్ధ సన్నివేశం, దుర్యోధనుడికి పిండప్రదానం చేస్తున్న అర్చకులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చేనేత సంఘం ఆధ్వర్యంలో జరిగిన దుర్యోధన వధ అలరించింది. ఉదయాన్నే స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు అభిషేకాలు చేపట్టారు. అనంతరం విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మట్టితో దుర్యోధనుడు, భీమసేనుడి ప్రతిమలను ఏర్పాటు చేశారు. పోతురాజు, ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ప్రతిమల వద్దకు తీసుకెళ్లారు. దుర్యోధనుడు, భీముడి మధ్య భీకర యుద్ధ ఘట్టం ఆకట్టుకుంది. ఆలయ అర్చకులు దుర్యోధనుడి మట్టి ప్రతిమ వద్ద పిండప్రదానం చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఐదేళ్ల తరువాత కోనపొంగలి


చదును చేసిన స్థలంలో కోనపొంగలి పెడుతున్న గ్రామస్తులు

- ఆక్రమణలు తొలగించిన గ్రామస్తులు

తిరుపతి సిటీ : ఐదేళ్ల తరువాత ఆదివారం రేణిగుంట మండలంలోని, వెంకటాపురంలో మళ్లీ కోనపొంగలి పెట్టారు. టీడీపీ హయాంలో ఆక్రమణకు గురైన సర్వే నంబర్ 269/9లో ఉన్న స్థలాన్ని గ్రామస్తులంతా కలిసి చందాలు వేసుకుని జేసీబీతో చదునుచేశారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో పొంగలి పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అదే స్థలంలో గ్రామస్తులంతా కలిసి భోజనం చేశారు.


కోనపొంగలి పెట్టిన స్థలంలోనే భోజనం చేస్తున్న గ్రామస్తులు

గురువులు దేశ నిర్మాతలు


వర్క్‌షాపులో పాల్గొన్న ముఖ్యఅతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: గురువులు దేశ నిర్మాతలని, వారిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంతో పాటు ప్రభుత్వంపైనా ఉందని ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్, తెలుగు ప్రాంత సహాయ్ ప్రముఖ్ మారుతి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాలులో ఆదివారం కన్యాకుమారికి చెందిన వివేకానంద కేంద్ర తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో టీచర్స్ ఈజ్ నేషనల్ బిల్డర్స్ మిషన్ 2047 అనే అంశంపై అధ్యాపకులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఇందులో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 2047కు వందేళ్ల పూర్తవుతాయన్నారు. దేశ నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర చాలా ఉందన్నారు. వచ్చే 24 ఏళ్ల పాటు గురువులు విద్యార్థులకు విషయ బోధనతోపాటు క్రమశిక్షణ జీవితం, నైతిక బాధ్యత, సామాజిక విలువలు నేర్పాలన్నారు. వ్యవసాయం, వ్యాపారం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. మానవ బంధాలు, క్రీడా పరిజ్ఞానం, ఆరోగ్య, పర్యావరణంపైనా వివరించాలని తెలిపారు. గురువులు బాధ్యతగా విద్యార్థుల తల్లి తండ్రులతో నెలకు ఒక్కసారైనా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా సమాజంలో ప్రజలు, ప్రభుత్వం గురువులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గురువుల నుంచి తయారయ్యే అధికారులు, డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలకు సంఘం ఇచ్చే గౌరవం, ప్రభుత్వం కల్పించే ఆర్థిక సౌకర్యాలు గురువులకు లభించడం లేదని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాకనాటి హరిక్రిష్ణ, విజయభాస్కరరెడ్డి, అబాకస్ రామక్రిష్ణారెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు చేయండి


మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఎస్సీ కాలనీలోని తాగునీటి చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కోసం కిలోమీటరు దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చుచేసి వేసిన చేతిపంపు నిరుపయోగంగా మారింది. చేతిపంపు మరమ్మతులకు సంవత్సరం కావస్తున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు


ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: ఏకాదశిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సొరకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు అభిషేకాలను నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనం అధిరోహించి, మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న స్వామికి ఆస్థానం నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు.

కంప్యూటర్ వితరణ



చిత్తూరు రూరల్: స్థానిక రాస్ అనాథ ఆశ్రమానికి ఆదివారం గుడిపాల మండలం నరహరిపేట 1982–1983 విద్యాసంవత్సర విద్యార్థులు కంప్యూటర్ వితరణ చేశారు. 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కంప్యూటర్ వితరణతో పాటు వృద్ధులు, బుద్ధిమాంద్యం పిల్లలకు అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. పూర్వవిద్యార్థులు విశ్వనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకర్‌రెడ్డి, రామదాసు, రాజకుమారి, జమున, రమాదేవి పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ


గాయపడిన సిద్ధు

శ్రీకాళహస్తి: మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణకు దిగి ఒకరికి గాయాలైన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలో ఆర్టీసీ బస్టాండు వద్ద చోటు చేసుకుంది. తొట్టంబేడు మండలం చోడవవరం గ్రామానికి చెందిన సిద్ధు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు వద్ద మద్యం సేవించిన సిద్ధు, ఓ గుర్తు తెలియని వ్యక్తికి మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి బ్లేడ్‌తో సిద్ధుపై దాడిచేయగా కంటిపై గాయమైంది. దీంతో గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. 2వ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని సిద్ధును ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీలోనే బీసీలకు సముచిత స్థానం

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో బీసీలకు అత్యున్నత పదవి, రాజ్యసభ సభ్యులుగా ఒకేసారి ఇద్దరికి ఇచ్చిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని శ్రీకాళహస్తి వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ విభాగ అధ్యక్షుడు ఆర్కాడు శంకర్ అన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ బీసీ నాయకులు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన టీటీడీ ధర్మకర్తల మండలి నియామకాలపై చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ప్రస్తుత టీటీడీ పాలకమండలి సభ్యుల్లో నాయీ బ్రాహ్మణులకు శాశ్వత సభ్యులుగా సీఎం జగనన్న అవకాశం కల్పించడంతో పాటు ప్రస్తుత ధర్మకర్తల మండలిలో కడప జిల్లాకు చెందిన యానాదయ్యను నియమించడం అభినందనీయమన్నారు. గతంలో నాయీ బ్రాహ్మణులను తిట్టించిన ఘనత చంద్రబాబుది అయితే వారికి ఉన్నత పదవులు కట్టబెట్టిన చరిత్ర జగనన్నది అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కనీసం ఒక బీసీని కూడా రాజ్యసభకు పంపలేకపోయారని ఆరోపించారు. సీఎం జగనన్న ఇక్కడ బీసీ అయిన సిపాయి సుబ్రహ్మణ్యంకు ఎమ్మెల్సీగా పదవి ఇచ్చి సముచిత గౌరవం నిలబెట్టారని తెలిపారు. సీఎం జగనన్నను విమర్శించే అర్హత టీడీపీలోని బీసీ నాయకులకు లేదని చెప్పారు.

ఎలమండ్యంలో ఘనంగా మారెమ్మ జాతర



విశేషాలంకరణలో అమ్మవారు, గెరిగ ఊరేగింపులో భక్తులు

రేణిగుంట: మండల పరిధిలోని ఎలమండ్యం దళితవాడలో ఆదివారం మారెమ్మ జాతరను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారికి గెరిగ ఊరేగింపు అత్యంత ఘనంగా ప్రారంభమైంది. మండల పరిధిలోని ఏడు గ్రామాల్లో పూజలందుకున్న అనంతరం గెరిగ సోమవారం తెల్లవారుజామున గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పెద్దఎత్తున మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వివిధ వేషాల్లో వీధుల్లో సందడి చేశారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు ఎం.పెద్ద సిద్ధయ్య, పి.సుబ్రమణ్యం, నాగరాజు, శంకరయ్య, గోపీ, ప్రసాద్, తిరుపాల్, జగయ్య, శేషాద్రి, నారాయణ, భువన, భూపతి, పద్మ, చంద్ర, చాముండేశ్వరి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కర్ణాటక సీఎస్


కర్ణాటక సీఎస్ వందితశర్మకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వందిత శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఈఓ సాగర్‌బాబు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పరుశురామేశ్వరుడి సేవలో నటుడు గుండు సుదర్శన్


ఆలయంలో గుండు సుదర్శన్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరుశురామేశ్వర స్వామివారిని ఆదివారం సినీ నటుడు గుండు సుదర్శన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం గుండు సుదర్శన్‌ను పూలమాలలు, శాలువలతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అతి పురాతనమైన ఆలయాన్ని దర్శించుకోవడం తన పూర్వ జన్మ సుకృతమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య, లైఫ్ సొసైటీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఎంపీటీసీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఒరవ కాలువకు మరమ్మతులు చేపట్టాలని నిరసన


చెరువులో నిరసన తెలుపుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కరకంబట్టు చెరువుకు నీరందించే ఒరవకాలువకు మరమ్మతులు చేపట్టి, చెరువుకు తెలుగుగంగ నీటిని అందించాలని రైతులు చెరువులో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ కరకంబట్టు చెరువుకు నీరందించే ఒరవ కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చెరువులోకి చుక్కనీరు రావడంలేదని తెలిపారు. చెరువులోకి నీరు రాకపోవడంతో పంటలు వేయలేదని, దీంతో పంటపొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో నీరులేక పంటలు పండకపోవడంతో వలసలు వెళుతున్నారని వాపోయారు. తెలుగుగంగ బ్రాంచి కాలువ లేకపోవడంతో, ఒరవకాలువ మరమ్మతులకు గురికావడంతో చెరువుకు తెలుగుగంగ నీరు రావడం లేదన్నారు. చెరువు చెట్లు, పుట్టలతో నిండిపోయి ఉందని తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి చెరువుకు నీరందించే ఒరవకాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన ఈశ్వరాంబ నృత్యశాల ఆధ్వర్యంలో నాట్య గురువు ప్రీతి మీనన్ పర్యవేక్షణలో కళాకారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది. కళాకారులు అనాఘ, శ్రీయ, మీనన్, శ్రీయాస్, గౌరి, విజయ, వేదిక, ఆర్యన్ నంద, అన్విత ప్రియను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

వాహనాల రూట్ మళ్లింపు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు భారీ వాహనాలు, ఇతర వాహనాల రాకపోకలను, పళ్లిపట్టు నుంచి నగరికి వచ్చే వాటిని గుండ్రాజుకుప్పం గ్రామం నుంచి పుత్తూరు వైపునకు మళ్లించామని సీఐ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పుత్తూరు నుంచి చెన్నై హైవేలో వచ్చే వాహనాలను పుత్తూరు నుంచి నింద్ర మీదుగా చెన్నైకి, తిరుత్తణి నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలను కనకమ్మసత్రం, విజయపురం, నింద్ర మీదుగా పుత్తూరుకు మళ్లించడం జరిగిందన్నారు. వాహనదారులు సదరు మార్గాల్లో వెళ్లి సహకరించాలని కోరారు.

కీళపట్టు నుంచి రోడ్ షో

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు హెలిప్యాడ్ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సులో రోడ్ షోగా సభాస్థలికి చేరుకుంటారు. సుమా రు రెండు కిలోమీటర్లు వరకు జనంతో మమేకమవుతారు. అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చే ప్రజల కోసం రోడ్డుకు ఇరువైపులా బ్యారికేడ్లు నిర్మించారు.

7న గోకులాష్టమి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీకృష్ణస్వామి ఆలయంలో సెప్టెంబరు 7న గోకులాష్టమిని ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకులాష్టమి రోజున ఉదయం శ్రీకృష్ణస్వామి మూలవర్లకు అభిషేకం, అర్చన చేస్తామని, ముఖ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ చేస్తామని వెల్లడించారు. రాత్రి 7 నుంచి 8.15 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారని తెలిపారు. రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు గోపూజ, గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 8న ఉట్లోత్సవాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, తరువాత ఊంజల్‌సేవ ఉంటాయని వెల్లడించారు. సాయంత్రం 6.15 నుంచి రాత్రి 7.30 గంటల వరకు స్వామివారికి ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ కారణంగా సెప్టెంబరు 8న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవను రద్దు చేస్తున్నట్లు వివరించారు.